చెత్త తొలగించరూ..!



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జూబ్లీ మార్కెట్‌లో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుందని కూరగాయల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి మార్కెట్‌లో పారిశుధ్య చర్యలు చేపట్టక పోవడంతో దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్నామని, మార్కెట్‌లో తాగునీరు, మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

మొక్కలకు నిప్పు..!



వాంకిడి: ఒక వైపు ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేసుకుంటూ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తుంటే అధికారుల నిర్లక్ష్యానికి నిధులు వృధా అవుతున్నాయి. ఎన్నో రూపాయలు వెచ్చించి రహదారుల గుండా నాటిన ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలకు రక్షణ కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మండలంలోని జంబుల్‌ధరి, వాంకిడి గ్రామ పంచాయతీల పరిధిలో పొదలకు నిప్పు పెట్టడంతో ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు అగ్నికి ఆహుతవుతున్నాయి. ఇదివరకే అధికారులకు పలువురు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో జంబులధరి గ్రామ సమీపంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న పొదలకు శనివారం మళ్లీ నిప్పు పెట్టడంతో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు కాలిపోయాయి. రోడ్డుకు ఇరువైపులా పంట చేలు ఉన్న రైతులకు మొక్కల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తే మొక్కలను కాపాడుకోవచ్చని పలువురు పర్యావరణ హితులు పేర్కొంటున్నారు.

రోడ్లపై పశువులు

దహెగాం మండల కేంద్రంలో రోడ్లపై పశువులు సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పలుమార్లు పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువులు రోడ్లపై సంచరించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – దహెగాం



పచ్చని తోరణం



వాంకిడి: మండలంలోని సరాండి గ్రామ పంచాయతీ పరిధిలో నాటిన ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు వాహనదారులకు, పాదాచారులకు చలువ పందిళ్లుగా మారాయి. మండుతున్న ఎండల్లోనూ అత్యవసర పనుల నిమిత్తం బయటికి వెళ్లే వారిని సేదతీరుస్తున్నాయి. గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో భాగంగా నాలుగేళ్ల క్రితం రహదారి వెంట నాటిన ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు ప్రస్తుతం చెట్లుగా మారి ఆకర్షణగా నిలవడమే కాకుండా రోడ్డు వెంట చల్లని నీడ ఇస్తున్నాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది తీసుకున్న ప్రత్యేక శ్రద్ధతో ప్రస్తుతం సుమారు 2 కి.మీల మేర మొక్కలు చెట్లుగా మారి ప్రజలకు, పర్యావరణానికి ఉపయోగకరంగా ఉన్నాయి. ఆ రహదారి గుండా ప్రయాణించే ప్రజలు సరాండి గ్రామ పంచాయతీ సిబ్బందిని అభినందిస్తున్నారు.

క్లుప్తంగా

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సారయ్య, నాయకులు

బెజ్జూర్: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సారయ్య అన్నారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన రజతోత్సవ బహిరంగ సభ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రజతోత్సవ బహిరంగ సభతో కాంగ్రెస్ పార్టీకి సమాధి కడదామన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ ఒక్క పథకాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ సభతో సర్కారుకు ముచ్చెమటలు పట్టాలన్నారు. రజతోత్సవ బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మోహన్, షమియోద్దీన్, తిరుపతి, హరీశ్, రాజలింగు, బాబు తదితరులు పాల్గొన్నారు.

కూలిన సైడ్‌వాల్.. వాహనాలు ధ్వంసం



ధ్వంసమైన వాహనాలు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వర్షానికి పట్టణంలోని మెయిన్ మార్కెట్‌లో నిర్మాణంలో ఉన్న మూడు అంతస్తుల భవనం సైడ్‌వాల్ కూలిపోయింది. దీంతో షాపుల ముందు పార్కింగ్ చేసి ఉన్న ఓ మోటారు సైకిల్, సైకిల్ ధ్వంసమయ్యాయి. కూలిన సమయంలో ప్రజలు ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

ఆసిఫాబాద్: సిర్పూర్(యూ) మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద జైనూర్ సీఐ రమేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఏఎస్పీ చిత్తరంజన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చడానికి పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జైనూర్ సీఐ రమేశ్, సిర్పూర్(యూ) ఎస్సై రామకృష్ణారావు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

చింతలమానెపల్లి: మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. సిర్పూర్(టి) మండలం లోనవెల్లి గ్రామానికి చెందిన చాప్లె కుమార్, తన కుమారుడితో కలిసి రుద్రాపూర్‌లోని బంధువుల ఇంటికి వచ్చాడు. సాయంత్రం కుమార్ తన కుమారుడు రితిక్‌తో రహదారిపై నడుస్తుండగా చింతలమానెపల్లి నుంచి సలుగుపల్లి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో ఇద్దరూ రహదారిపై పడిపోయారు. కుమార్‌కు స్వల్పగాయాలు కాగా రితిక్‌కు పక్కటెముకల్లో గాయాలయ్యాయి. 108లో బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి అనంతరం మెరుగైన చికిత్స కోసం కాగజ్‌నగర్ తరలించారు.

శిథిలావస్థకు భవనాలు..!

- కూలేందుకు సిద్ధంగా ఉన్న డీఆర్ డిపో భవనాలు
- అద్దె గదుల్లో కొనసాగింపు
- పట్టించుకోని జీసీసీ అధికారులు



అద్దెగదిలో కొనసాగుతున్న కెరమెరి రేషన్‌షాపు



అధ్వానంగా కెరమెరి డీఆర్ డిపో భవనం

కెరమెరి: పేదలకు ఉచితంగా రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు నిర్మించిన డీఆర్ డిపో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆ భవనాల్లో నిల్వచేసిన బియ్యం బస్తాలకు రక్షణ లేకుండా పోతోంది. గదుల పైకప్పులు ఊడిపోయి ఉండడం వల్ల వాన పడితే బియ్యం బస్తాలు తడిసి ముద్దవుతున్నాయి. దీంతో చేసేదేమిలేక సేల్స్‌మెన్‌లు వానాకాలం వచ్చిందంటే అద్దె భవనాల్లో రేషన్ సరుకులు పంపిణీ చేయాల్సిన దుస్థితి నెలకొంది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలకు కనీసం మరమ్మతులు కూడా చేయలేని స్థితిలో జీసీసీ (గిరిజన సహకార సంస్థ) ఉంది. మండలంలోని కెరమెరి, ధనోరా, పాట్నాపూర్, అనార్‌పల్లి, కొఠారి గ్రామాల్లో డీఆర్‌డిపోలు ఉన్నాయి.

అధ్వానం..

కొఠారి గ్రామంలో 443 రేషన్‌కార్డులు ఉండగా.. 100 క్వింటాళ్ల బియ్యం ప్రతీనెల పంపిణీ చేస్తున్నారు. అలాగే కెరమెరిలో 1616 తెల్లరేషన్ కార్డులు, 120 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతీ నెల 380 క్వింటాళ్లు పంపిణీ చేస్తున్నారు. కొఠారిలో ప్రస్తుతం పంపిణీ జరుగుతున్నప్పటికీ ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులు ఊడిపోతున్నాయి. ఈదురుగాలులు, భారీ వర్షం వస్తే కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది.

ప్రతిపాదనలు పంపించాం



గతేడాదితో పాటు ఇటీవల శిథిలావస్థకు చేరిన డీఆర్‌డిపో భవనాలకు సంబంధించిన నివేదికలు డీఎంకు పంపించాం. కానీ ఇంత వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఈ నెల 16న డీఎంతో ప్రత్యేక సమావేశం జరుగనుంది. అధికారులు దృష్టికి సమస్య తీసుకెళ్తాను. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– తారాచంద్, జీసీసీ మేనేజర్, ఆసిఫాబాద్

దీంతో వానలు ప్రారంభం కాగానే సుమారు ఐదు నెలలపాటు అద్దె భవనంలో రేషన్‌షాపు కొనసాగిస్తారు. దీనికి నెలకు రూ. 1200 చెల్లించాల్సి ఉంటుంది.

రెండేళ్లుగా అద్దె భవనంలోనే..

కెరమెరికి చెందిన డీఆర్‌డిపో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. తలుపులు, కిటికీలు బాగాలేదు. పైకప్పు కూలిపోయింది. భవనంలో పందికొక్కులు రాజ్యమేలుతున్నాయి. పరిసర ప్రాంతం ప్రస్తుతం చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో రెండేళ్ల నుంచి అద్దె భవనంలోనే రేషన్ షాపు కొనసాగుతోంది. ప్రతీనెల రూ.8 వేలు అద్దె చెల్లిస్తున్నారు. స్థలం ఉన్నప్పటికీ భవనం నిర్మించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. కాగా అనార్‌పల్లిలో కిటికీ లెవల్ వరకు నిర్మాణం పూర్తయ్యి నిధులు లేక అర్ధాంతరంగా నిలిచిపోయింది. పాట్నాపూర్‌లో ఇంకా భవనాలు ప్రారంభం కాలేదు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ



సిర్పూర్(టి): దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

సిర్పూర్(టి): తెలంగాణ ప్రభుత్వం అతి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను ఆదివారం సిర్పూర్(టి) ఎంపీడీవో సత్యనారయణ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్వీకరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని వ్యక్తిగత అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని ఎంపీడీవో ఆల్బర్ట్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అందించిన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మండుతున్న ఎండలు..!

- ఆసిఫాబాద్‌లో 42.3 డిగ్రీలు నమోదు



నిర్మానుష్యంగా కౌటాల -విజయనగరం రోడ్డు

కౌటాల: గత నాలుగు రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటుతున్నాయి. జిల్లాలో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. గాలిలో తేమ తగ్గిపోవడంతో ఉదయం 9 గంటల నుంచే జనం చెమటతో తడిసిపోతున్నారు. అధిక వేడికి తోడుగా వడగాల్పులు వీస్తున్నందున జనం ఇళ్లలోనే ఉడికిపోతున్నారు. పెరిగిన ఉష్ణోగ్రతలతో పిల్లలు, పెద్దలు తీవ్ర ఇబ్బందులు ఎడుతున్నారు.

ఎండ ప్రతాపం..

ఆదివారం ఎండలు విపరీతంగా మండిపోయాయి. జిల్లాలో రికార్డుల స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆసిఫాబాద్‌లో అత్యధికంగా 42.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు మండుతుండడంతో ద్విచక్ర వాహనదారులు, చిరువ్యాపారులు వడ గాలులకు అల్లడిపోయారు. పలువురు శీతల పానీయాలను ఆశ్రయించారు. ఓ పక్క ఎండ.. మరో పక్క వేడి గాలులు వీస్తుండడంతో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు. ఎండలు మండుతుండడంతో జిల్లాలోని 12 మండలాల్లో అలెర్ట్ జోన్‌లో ఉన్నాయి.

ఆదివారం నమోదైన పగటి ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లలో..)

ప్రాంతం	గరిష్టం
ఆసిఫాబాద్	42.5
సిర్పూర్(టి)	42.0
కెరమెరి	42.0
పెంచికల్‌పేట్	42.0
తిర్యాణి	41.9
దహెగాం	41.8
రెబ్బెన	41.7
బెజ్జూర్	41.5
కౌటాల	41.4



జై భీం అనే అర్హత కాంగ్రెస్‌కు లేదు

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న హరీశ్‌బాబు

నస్పూర్: డా. బీఆర్ అంబేడ్కర్ జీవించి ఉన్నన్ని రోజులు ఆయనను ఎన్నో విధాలుగా అవమానించిన కాంగ్రెస్‌కు జై భీం అనే అర్హత లేదని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నస్పూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సీసీసీ కార్నర్‌లోని అంబేడ్కర్ విగ్రహాన్ని జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌తో కలిసి శుద్ధి చేశారు. అనంతరం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా జై భీం, జై బాపు, సంవిధాన్ అంటూ కాంగ్రెస్ నాయకులు వీధుల్లో తిరుగుతూ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. బీజేపీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, రాజ్యాంగాన్ని సవరిస్తుందని అసత్యపు ఆరోపణలు చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల అభ్యున్నతికి బీజేపీ ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు. రఘునాథ్ మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలోని అండాలమ్మ కాలనీలో చెత్త డంప్‌యార్డును తరలించడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలం అయ్యారన్నారు. వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. నేడు జిల్లా వ్యాప్తంగా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం అశోక్, కొయ్యల ఏమాజి, శ్రీదేవి, గాజుల ముకేష్‌గౌడ్, సత్రం రమేశ్, కట్కూరి సతీష్‌కుమార్, మిట్టపల్లి మొగిలి, పొన్నవేని సదానందం తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఆదివాసీల జీవితాల్లో వెలుగులు



అక్షరాలు దిద్దిస్తున్న ఎంపీడీవో మల్లేశ్

తిర్యాణి: చదువుతోనే ఆదివాసీ గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఎంపీడీవో వేముల మల్లేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని గుండాల గ్రామంలో నిరక్షరాస్యులైన ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సెలవులు వస్తే హాయిగా కుటుంబ సభ్యులతో, స్నేహితులతో సేదతీరే ఈ రోజుల్లో గుట్టలెక్కి గూడేల్లోకి వెళ్లి ఆదివాసీ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కాగజ్‌గనర్ మండలంలోని మండల పరిషత్ పాఠశాలలో పని చేస్తున్న సుందిళ్ల రమేశ్ ఆదివాసీ నిరక్షరాస్యుల్లో చైతన్యం నింపుతున్నాడన్నారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ మర్సకోల రాం పటేల్, సీఆర్పీలు మర్సకోల అశోక్, శంకర్, మాజీ ఎంపీటీసీ కోవ మోతిరాం, పంచాయతీ కార్యదర్శి రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్ర విజయవంతం



మాట్లాడుతున్న నాయకుడు శివగౌడ్

కాగజ్‌నగర్‌రూరల్: హనుమాన్ శోభాయాత్ర విజయవంతానికి కృషి చేసిన వారికి హిందూ జాగరణ్ మంచ్ నాయకుడు శివగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం పట్టణంలోని పాత హనుమాన్ ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శోభాయాత్ర విజయవంతం కావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. సమావేశంలో హిందూ జాగరణ్ మంచ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలి


- జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ అహిర్



జిమ్ ప్రారంభిస్తున్న హంసరాజ్ అహిర్

ఆసిఫాబాద్: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ అహిర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు జిమ్‌ను ఆదివారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్ రావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శారీరక దృఢత్వం కోసం ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోనగిరి సతీశ్‌బాబు, కొంగ సత్యనారాయణ, మాటూరి జయరాజ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్, మాలి సంఘం నాయకుడు శంకర్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.


రాజ్యాంగ రక్షణ అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాంకిడి: రాజ్యాంగ సంరక్షణ అందరి బాధ్యత అని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆత్రం సక్కు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జై బాపు, జై భీం, జై సంవిధాన్ అభియాన్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆట పాటలతో మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగానికి తూట్లు పొడిచే దిశగా అడుగులు వేస్తుందన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకునే బాధ్యత ప్రతీ భారతీయుడిపై ఉందని పేర్కొన్నారు. దేశంలో బీజేపీ అప్రజాస్వామిక పాలనను కొనసాగిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, టౌన్ అధ్యక్షుడు అనిల్, యూత్ అధ్యక్షుడు ప్రశాంత్ దుర్గె, దీపక్, మెంగాజీ, హనుమంత్, సెల్వట్కార్ పెంటు, సంతోష్, జైరాం తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కౌటాల ఎస్సై ఎస్. మధుకర్ అన్నారు. ఆదివారం మండలంలోని వీర్దండి గ్రామంలో యువకులకు ఆయన వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడుతూ, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. యువత నిత్యజీవితంలో క్రీడలను భాగంగా చేసుకోవాలన్నారు. యువత బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని, చట్టవ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటే బంగారు భవిష్యతు నాశనమవుతుందని హెచ్చరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.